www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 24 ఏప్రిల్ 2025

5

కాకినాడ



పిఠాపురం భాష్యం ప్రభంజనం

ప్రజాశక్తి - పిఠాపురం

10వ తరగతి ఫలితాలలో పిఠాపురం భాష్యం విద్యార్థిని కె.ప్రేమ సత్యలిఖిత 600 మార్కులకు 599 సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే ఒ.రిషిక సంధ్య 591, కె.గీతా వాణీశ్రీ 589, బి.రూపసత్యశ్రీ మహాలక్ష్మీ 584, కె.బ్రహ్మచైతన్య 581, వి.నాగహర్ష అఖిలేష్ 581 మార్కులు సాధించారు. విద్యా ర్థులను భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌ఛార్జ్ వి.గోవిం దరాజు, పాఠశాల ప్రిన్సిపల్ పి.వేణు, ప్రైమరీ హెచ్‌ఎం అరుణ, ఎంఇఒలు శ్యాంబాబు, నారాయణదాసు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఇఒ

10 ఫలితాల్లో జిల్లా వెనకబాటు


- 15వ స్థానానికే పరిమితం
- 82.24 శాతం ఉత్తీర్ణత
- ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో కాకినాడ జిల్లా 82.24 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 15 స్థానం సాధించింది. ఈ సారి కూడా బలికలే పై చేయి సాధించారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాగా వున్నప్పుడు మెరుగైన ఫలితాలు సాధించిన జిల్లా గత మూడేళ్ళుగా వెనుకబడి పోతుంది. ఈఏడాది జరిగిన పరీక్షల నేపథ్యంలో బుధవారం విడుదలైన ఫలితాల్లో మెరుగైన రిజల్ట్స్ సాధించామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు బాలురు 13 వేల 708, బాలికలు 13 వేల 660 మందితో మొత్తం 27 వేల 368 మంది హాజరయ్యారు. వారిలో బాలురు 10 వేల మంది 850 మంది, బాలికలు 11 వేల 658 మందితో మొత్తం 22 వేల 508 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురలో 79.15 శాతం, బాలికల్లో 85.34 శాతంతో మొత్తం 82.24 శాతం ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా వున్నప్పుడు 2016-17లో 97.97 శాతం, 2017-18లో 97.61 శాతం, 2018-19 లో 98.19 శాతం, 2019-20లో నూరు శాతం, 2020-21 లో నూరు శాతం, 2021-22లో కేవలం 65.83 శాతం, జిల్లాల విభజన తర్వాత కాకినాడ జిల్లాలో 2022-23 లో 68.02 శాతం, 2023-24 లో 80.83 శాతం, ఇప్పుడు 2024-25లో 82.24 శాతం ఫలితాలు వచ్చాయి.




ఫలితాలపై సంతృప్తి

జిల్లాలో పదో తరగతి ఫలితాలు సంతృప్తినిచ్చాయని కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ అన్నారు. బుధవారం ఆయన జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదో తరగతి పాసైన విద్యార్థులకు, ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో కాకినాడ జిల్లాకు 15వ స్థానం మాత్రమే దక్కడం కొంత బాధాకరమైన విషయం అన్నారు. ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు దిగులు పడవద్దని వారికి మరో అవకాశం ఉందన్నారు. అందువల్ల పట్టుదలతో చదవాలని డీఈవో సూచించారు.

మే 19 నుంచి సప్లిమెంటరీ

భాష్యం విద్యార్థికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్

కాకినాడ : కాకినాడ భాష్యం స్కూల్ పదో తరగతి విద్యార్థిని యాళ్ల నేహాంజని 600కి 600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు భాష్యం కాకినాడ శాంతినగర్ శాఖ జోనల్ ప్రిన్సిపల్ వల్లూరి గోవిందరాజు తెలిపారు. తాను ఐఐటిలో చేరి ఐఎఎస్ సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తానని నేహాంజని తెలిపింది. అనంతరం ఉత్తీర్ణత సాధించిన నేహాంజలిని పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. ఇంతటి ఉత్తీర్ణ సాధించిన పట్ల ఉపాధ్యాయులను, సిబ్బందిని గోవిందరాజు అభినందించారు.



యాళ్ల నేహాంజలి

అడ్వాన్ సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుండి 28 తేదీ వరకు వుంటాయని అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు హాజరు కావాలని అనుకునే అభ్యర్థులు రీకౌంటింగ్, రీ-వేరిఫికేషన్ ఫలితాల కోసం వేచిచూడకుండా ఈ నెల 24 నుంచి వచ్చే నెల 1 లోపుగా ఆలస్య రుసుము లేకుండా, మే 1 నుంచి 18 వరకూ రూ.50 ఆలస్య రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. త్వరలోనే మార్కుల మెమోలు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. నిర్ణీత సమయానికి ఆయా పాఠశాలలకు మార్కుల సర్టిఫికెట్లు పంపిస్తామని తెలిపారు. రీ కౌంటింగ్ కోసం ప్రతి సబ్జెక్ట్‌కూ రూ.500, రీ వెరిఫికేషన్ కోసం ప్రతి సబ్జెక్ట్‌కూ రూ.1000 చెల్లించాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.


పోలవరం ఎడమ కాలువ పనులను పరిశీలిస్తున్న జలవనరుల శాఖామంత్రి రామానాయుడు

'ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు'

ప్రజాశక్తి - శంఖవరం, తుని

ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను సత్వరం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం ఆయన బెండపూడి, అన్నవరం, కృష్ణవరం ప్రాంతంలో పర్యటించారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను పరిశీలించారు. అనంతరం అన్నవరంలో పోలవరం ప్రాజెక్ట్ ఇంజ నీర్లు, వివిధ ప్యాకేజీల కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేసేలోపు గోదావరి వరద జలాలను పుష్కర, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలతో 5వేల క్యూసెక్కుల నీటిని ఉత్తరాంధ్ర జిల్లాలకు తరలించేందుకు పోలవరం ఎడమ కాలువ పనులను వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించామని తెలిపారు. నిర్ధేశించుకున్న లక్ష్యాల కనుగుణంగా పనులు జరుగటం లేదని, లక్ష్యాని కంటే సుమారు 30 శాతం వెనుకబడి ఉన్నాయని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో మెషినరీ, ఎక్సవేటర్లు, టిప్పర్లు, డంపర్లు, రోలర్లు, బ్యాచింగ్ ప్లాంట్‌లు, సిబ్బంది సమాకుర్చు కోకపోవడంపై ఏజెన్సీలు, అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ నాటికి ఎట్టి పరిస్థితులలో పనులు పూర్తి కావాలని, కాకుంటే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. హైవే క్రాసింగ్ బ్రిడ్జ్, పంపా అక్విడెక్ట్, కృష్ణవరం సైఫన్ వంటి క్లిష్టతరమైన పనులను సకాలంలో పూర్తి చేసేలా అధికారులకు సూచనలు చేశామని, అలాగే పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిగేలా అవసరమైన సహాయ సహకారాలను అందించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్టు తెలిపారు. 2025 జూన్ నాటికి ఎడమ కాలువ పనులను పూర్తి చేసే లక్ష్యంతో రూ.1200 కోట్లు కేటాయించి, టెండర్లు పిలిచి, పనులు కూడా అప్పగించామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ 41.15 మీటర్ల కాంటూరు లెవల్ మొదటి దశ లో 2027 డిసెంబర్ నాటికి పూర్తి కానుందని, షెడ్యూల్ కంటే ముందే జూన్ 2027లో గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పోలవరం ప్రాజెక్ట్ ఛీఫ్ ఇంజనీరు కె.నర్సింహమూర్తి, ఎస్ఇ బి.ఏసుబాబు, ఇఇలు రంగారావు, రాజేశ్వరరావు, శ్రీనివాస్, గోవిందు, ఉమేష్ కుమార్, ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడుదాం

ప్రజాశక్తి - కాజులూరు

రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాన్ని కాపాడుదామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి సుభాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తాన్ని ఎవరు తయారు చేయలేరని, కేవలం దానం చేయడమొక్కటే మార్గమని అన్నారు. రక్తదానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు, భయాన్ని పోగొట్టి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఒకసారి రక్తదానం చేస్తే ముగ్గురు ప్రాణాలు కాపాడవచ్చునని అన్నారు. తరచుగా రక్తం దానం చేయడం వల్ల క్యాన్సర్ వంటి రోగాల బారిన పడే ముప్పుతప్పుతుందన్నారు. రక్తదానం చేయడం పట్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకుని ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాంబాబు, వ్యవసాయ శాఖ అధికారి అశోక్, ఎపిఒ వెంకటలక్ష్మి, మండల ఇంజనీరింగ్ అధికారి భవాని శంకర్, డాక్టర్ రామ్మోహన్‌ప్రసాద్, మాజీ ఎంపిపి యాళ్ళ కృష్ణారావు, చంద్రు వీర్రాజుచౌదరి పాల్గొన్నారు.

మే 2 నుంచి రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వచ్చే నెల 2వ తేదీ నుంచి కాకినాడ ఎన్‌టిఆర్ బీచ్‌లో రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఎల్‌ఎ పంతం నానాజీ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకూ నిర్వహించే ఈ పోటీల్లో 13 పురుష, 13 మహిళల జట్లు పాల్గొంటాయని తెలిపారు. సుమారు 45 మ్యాచులు జరిగే ఈ పోటీల్లో 208 మంది వరకు క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి జాతీయ స్థాయిలో ఎంపికకు అవకాశం ఉంటుందని వివరించారు. విన్నర్ జట్టుకు రూ.10 లక్షల వరకు మొదటి బహుమతి ఉంటుందన్నారు. ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిపి నందిపాటి అనంతలక్ష్మి, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకట రెడ్డి, నాయకులు పెంకే శ్రీనివాసబాబా, చప్పిడి వెంకటేశ్వరరావు, నురుకుర్తి వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తిలో అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

న్యాయవాద వృత్తిలో అనుక్షణం అప్రమత్తత అవసరమని ప్రత్తిపాడు కోర్టు న్యాయమూర్తి కాటం భాను అన్నారు. ఇటీవల విజయం సాధించిన ప్రతిపాడు బార్ అసోసియేషన్ సభ్యులతో ఆయన బుధవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో న్యాయవాద వృత్తి ఎంత గౌరవమైనదో అంతే బాధ్యతాయుతమైనదన్నారు. న్యాయవాదులు ఎప్పటి కప్పుడు మారుతున్న చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులు రాజాల చిట్టిబాబు, గౌరీ శంకర్, ఉపాధ్యక్షుడు కాపిసెట్టి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కామేశ్వరరావు, కోశాధికారి పలివెల నాగేంద్ర రాజు, స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శి కె.శ్రీనివాస భారతి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వహకులు

మోడల్ ఇఏపి సెట్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కాకినాడ

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎపిఇఎపి సెట్ మోడల్ పరీక్షను జయప్రదం చేయాలని విద్యారంగ ప్రముఖులు పిలుపునిచ్చారు. బుధవారం ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జివి.కృష్ణమరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీకాంత్, ఎఒ జివికె.వర్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ విద్యావేత్తలు మాజీ ఎంఎల్‌సిలు చుక్కా రామయ్య, కెఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో ఈ పరీక్షను గత 24 సంవత్సరాలుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. 5 రోజులపాటు ఐడియల్ కళాశాలలో నిర్వహించే ఈ పరీక్షలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ కార్యదర్శి గంగా సూరిబాబు కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో సాంకేతిక విద్య నాణ్యత కొరవడిందని, తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ కళాశాలలో పూర్తిస్థాయిలో అధ్యాపకులు ఉండడం లేదని అన్నారు. ఎఐసిటి ఈ నిబంధనలను అన్ని కళాశాలలో పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్‌కుమార్, రఘువరన్, పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - పిఠాపురం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎంఎల్ఎ పవన్‌కల్యాణ్ పర్యటనకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 25న నియోజక వర్గంలో పర్యటించనున్న డిప్యూటీ సిఎం పర్యటన ఏర్పాట్లపై బుధవారం స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ పాఠశాలలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న డిప్యూటీ సిఎం నియోజకవర్గం పర్యటన సందర్భంగా పిఠాపురంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారని అన్నారు. అలాగే రచ్చబండ కార్యక్రమం, మహిళ లబ్ధిదారులకు కుట్టు మిషన్లు, రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ వంటి కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని తెలిపారు. ఈ పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఆయన పర్యటన విజయవంతం చేయాలని ఆదేశించారు. హెలిప్యాడ్‌ను ఆర్ఆర్‌బిహెచ్ఆర్ పాఠశాల మైదానంలో ఏర్పాటు చేయడం జరిగిందని, హెలిపాడ్ వద్ద ఏర్పాట్లను హౌసింగ్ పీడీ పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆర్ఆర్‌బిహెచ్ఆర్ పాఠశాలలో నిర్వహించే రచ్చబండ కార్యక్రమం సక్రమంగా జరిగేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. యు కొత్తపల్లి గ్రామంలో నిర్మించనున్న టిటిడి కళ్యాణ మండపం, గొల్లప్రోలు, చేబ్రోలు గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శంకుస్థాపన శిలాఫలకాల ఆవిష్కరణ ఉంటుందన్నారు. అనంతరం రథాలపేట అంబేద్కర్ సామాజిక భవనంలో బిసి కార్పొరేషన్ ద్వారా మహిళల విద్యార్థులకు కుట్టు మిషన్లు, వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు యంత్ర పరికరాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పిఠాపురం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఏరియా ఆస్పత్రికి శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటున్నందున తగినంత తాగునీరు, బట్టర్ మిల్క్, ఇతర స్నాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ సిఎం పర్యటించే ప్రాంతాలను కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్‌పి బిందుమాధవ్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా సంబంధిత శాఖల అధికారులతో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి మానిష్ పాటిల్ దేవరాజ్, అదనపు ఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు, డిఆర్ఒ జె.వెంకటరావు, పాడా పీడీ ఎ.చైత్రవర్షిణి, అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

విద్యార్థుల తరలింపు ఆపాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మోడల్ స్కూల్స్ పేరుతో ఎలిమెంటరీ పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను తరలించి ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయటం అన్యాయమని సిపిఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ అన్నారు. బుధవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఇచ్చిన జిఒ 117ను అమలు చేయబోమని, ఆ జీవో రద్దు చేస్తామని కూటమి పార్టీల నేతలు ప్రకటించారన్నారు. కానీ చాప కింద నీరులా కొన్ని మార్పులతో నూతన విద్యా విధానం జిఒను అమలు ప్రారంభించిందన్నారు. మోడల్ స్కూల్స్ పేరుతో తరగతులను విలీనం చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో 1,2 తరగతులను ఉంచి 3,4,5 తరగతులను మరో చోటుకు మార్పు చేసి వాటినే మోడల్ స్కూల్స్ అని చెబుతున్నారన్నారు. 14 పాఠశాలలను ఫౌండేషన్ స్కూల్స్‌గా మారుస్తూ నివేదికలు పంపించారన్నారు. పట్టణంలో 3 ఉన్నత పాఠశాలలు 4 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు ఉంటే వాటిలో మూడు అప్పర్ ప్రైమరీ పాఠశాలలను ఎలిమెంటరీ మోడల్ స్కూల్స్‌గా మార్చారన్నారు. ఎక్కడైనా పాఠశాలలను అభివృద్ధి చేస్తూ తరగతి గదులను పెంచుతూ వాటిని హైస్కూల్స్‌గా మార్చాలని, కానీ అందుకు విరుద్ధంగా తరగతులను విలీనం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కేదారి నాగు, సిరపరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికుమార్

పదో తరగతి ఫలితాల్లో 'శ్రీ అగస్త్య' జోరు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని శ్రీఅగస్త్య విద్యాసంస్థలు పదవ తరగతి ఫలితాలల్లో తన జోరును కొనసాగించింది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి శ్రీ అగస్త్య విశ్వక్ క్యాంపస్‌లో అభినందన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా 591 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన ఇ.శ్రీఅక్షర, ఆర్.మాన్విత, 590 మార్కులు సాధించిన బి.మోక్ష శ్రీసాయిలను శ్రీ అగస్త్య విద్యాసంస్థల ఛైర్మన్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. తమ పాఠశాల నుంచి ముగ్గురు 590 మార్కులకు పైగా సాధించగా, 13మంది 580 మార్కులకు పైగాను, 31మంది 570 మార్కులకు పైగాను, 64 మంది 550 మార్కులకు పైగాను, 92 మంది 500 మార్కులకు పైగా సాధించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ అగస్త్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ దొడ్డిపట్ల శ్రీపల్లవి, జోనల్ ప్రిన్సిపల్ సురేష్, ప్రిన్సిపల్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విక్టరీని చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మండలంలో 81 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలో 81 శాతం విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొక్కా తనూశ్రీ(585), ప్రతిభ పాఠశాలకు చెందిన బి.రాధాకృష్ణ సాయి (596) మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య మాట్లాడుతూ మండలంలో 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 1029 మంది పరీక్షలకు హాజరుకాగా 774 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ప్రయివేటు పాఠశాలల నుంచి 492 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 458 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్‌ఎం లు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీలు అభినందించాయి. ఓపెన్ స్కూల్ 10వ తరగతి ఫలితాల్లో స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ మంచి ఫలితాలు సాధించిందని అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. 74 మంది పరీక్షలకు హాజరు కాగా 72 మంది ఉత్తీర్ణతతో 97 శాతం ఉత్తీర్ణత సాధించారని, తెలిపారు.


రాధాకృష్ణ సాయి


బొక్క తనుశ్రీ

వివిఎస్‌లో ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి


వివిఎస్ విద్యా సంస్థల విద్యార్థులు 10వ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని విద్యా సంస్థల అధినేత అనిశెట్టి కృష్ణారెడ్డి తెలిపారు. పి.షర్మిల 583 మార్కులతో ప్రథమ స్థానం, 574 మార్కులతో ఒ.అభి ద్వితీయ స్థానం, 573 మార్కులతో జి.ప్రవల్లిక తృతీయ స్థానం సాధించారని ఆయన తెలిపారు. 13 మంది విద్యార్థులు 500 మార్కులు పైబడి సాధించినట్లు వెల్లడించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ అనిశెట్టి సత్యానందరెడ్డి, హెచ్‌ఎం ధనలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు. ఇదిలావుంటే, ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఉత్తమ ఫలితాలు వచ్చాయని ఎంఇఒ వేణుగోపాల్ తెలిపారు. యండవల్లి హైస్కూల్‌కు చెందిన వైఎస్.వెంకటసుధ, దడాల అక్షయ 586 మార్కులు సాధించారని, వాకా తిప్ప హైస్కూల్ విద్యార్థి ఎం.మహాలక్ష్మి 584 మార్కులతో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల నుంచి 814 మంది పరీక్షలకు హాజరు కాగా 614 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

ఆదిత్యలో ముగిసిన ఆన్‌లైన్ కోర్స్

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ, భారత ప్రభుత్వ షిప్పింగ్-జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నెల రోజులపాటు జరిగిన ఆన్‌లైన్ కోర్స్ బుధవారం ముగిసింది. ఈ కోర్సులో 20 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌డివివిఎస్.భీమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రో -ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో -ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో -వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్.రమాశ్రీ, ప్రో -వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్ అండ్ సైన్సెస్) డాక్టర్ ఎ.రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్ విద్యార్థులను అభినందించారు.

కార్టూ'నిజం'



విచ్చలవిడిగా ఫార్మసీలు

- అర్హత లేని సిబ్బందితో నిర్వహణ
- డాక్టర్ల చీటీ లేకున్నా మందుల విక్రయం

అధిక శాతం తేమ ఉన్నా కొనుగోలు

ప్రజాశక్తి - పిఠాపురం

రైతులు పండించిన ధాన్యంలో 22 శాతం వరకు తేమ ఉన్నా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఆర్ఆర్‌హెచ్ఆర్ పాఠశాలలో వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం రైతులు వద్ద నుంచి కొనుగోలు చేసే ధాన్యంలో17 శాతం తేమ ఉండాల్సినప్పటికి 22 శాతం వరకు తేమ ఉన్న రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. అందుకు సరిపడా అదనంగా ఒక శాతానికి ఒక కేజీ చొప్పున ధాన్యం తూకం వేయాలన్నారు. 22 శాతం కంటే తేమ ఎక్కువగా ఉన్నట్లయితే రైతు విధిగా ధాన్యాన్ని ఎండబెట్టిన తర్వాత మాత్రమే కొనుగోలు చేయాలని అన్నారు. దళారుల బారినబడి పడి రైతులు మోసపోకుండా మద్దత్తు ధరకు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్ కుమార్, పౌరసరఫరాల సంస్థ డిఎం ఎం.దేవులా నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్.సత్యనారాయణరాజు, వ్యవసాయ శాఖ ఎడి పి.స్వాతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దోపిడీని అరికట్టాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పోలేకుర్రు, పి.మల్లవరం, జార్జిపేట, చిన్నబాపనపల్లి, పెదబాపనపల్లి, తంగేటిపంపు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. రైతులు, కౌలు రైతులు వద్ద నుంచి రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది మిల్లర్స్, మధ్య దళారులు ఏకమై తక్కువ ధరకు కొంటున్నారని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. మిల్లర్లు రూ.1550 మాత్రమే ఇస్తామంటున్నారని అన్నారు. దళారులకు అమ్మడం ద్వారా ఒక బస్తాకు రూ.125 నష్టం వస్తుందనీ రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం కొత్త గోనె సంచులు ధాన్యం పట్టేందుకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉగ్ర దాడి బాధాకరం: తుమ్మల

ప్రజాశక్తి - సామర్లకోట

జమ్మూ కాశ్మీర్ బైసరన్ ప్రాంతంలో 28 మంది పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి చాలా బాధాకరమని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. బుధవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద జనసేన పార్టీ జెండాను సగం వరకు దించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లో 28 మంది పర్యాటకులను దారుణంగా హతమార్చిన సంఘటన చాలా బాధాకరమని అన్నారు. యావత్ దేశం ఖండిచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సరోజ్ వాసు, పొలమరశెట్టి సత్తిబాబు, మంచెం సాయిబాబు, మడగల శ్యామ్‌కుమార్, తుమ్మల ప్రసాద్, చోడిశెట్టి ఇందిరా, రాయుడు శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి సిపిఎం ఖండన

పిఠాపురం: జమ్మూ కాశ్మీర్‌లో పహల్గాంలో జరిగిన ఉగ్రవాది దాడిని సిపిఎం నాయకులు కె.చిన్న, కోనేటి రాజు బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 370 రద్దు ద్వార ఉగ్రవాదం నశిస్తుందని ప్రసంగాలు చేసిన కేంద్ర పాలకులు దీనికి ఏం సమాధానం చెబుతారని అన్నారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వం తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన వరుస దొంగతనాల కేసులలోని ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల విలువైన కెమెరాలు, ల్యాప్‌టాప్, హార్డ్ డిస్కులు, ప్రింటర్లు, మానిటర్లతోపాటు ఒక కారు, రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ నాయక్ తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17వ తేదీ తెల్లవారుజామున దేవరపల్లి మెయిన్ రోడ్డులోని ఆర్‌కె ఫోటో స్టూడియో, నిడదవోలులోని మరో రెండు ఫోటో స్టూడియోలలో షట్టర్ తాళాలు పగలగొట్టి లోపల గల విలువైన సామాగ్రిని నిందితులు చోరీ చేసినట్లుగా గుర్తించారు. ఈ మేరకు నమోదైన కేసులను చేధించేందుకు పోలీసుల బృందాలు గుంటూరు, విజయవాడ, కోదాడ, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన షేక్ సమీర్ ఫైజల్(21), అల్లాడి నాగమణికంఠ ఈశ్వరమణి(24), నాగదాసరి మెసిమన్ అనే సిమ్(25), రామిశెట్టి దేవీప్రసాద్(21), మనగంటి గోపి(25), జెల్లి వెంకట సూర్య సత్య మణి సాయి కీర్తన (24)లను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. నిందుతులు ముందస్తుగా దొంగతనం చేయబోయే ప్రదేశంలో రెక్కీ నిర్వహించిన అనంతరం రాత్రివేళ జన సంచారం లేని సమయాలలో దొంగతనాలు చేసేవారని అన్నారు. స్వల్పకాలంలో ఈ కేసులను చేధించి దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐలు సుబ్రహ్మణ్యం, సతీష్‌కుమార్‌లతోపాటు, సిబ్బందిని ఆయన అభినందించారు.

బెల్టు షాపుపై దాడి- ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - కాత్రేనికోన

కాత్రేనికోన గ్రామ శివారు వేట్లపాలెంలో నిర్వహిస్తున్న బెల్టు షాపుపై కాత్రేనికోన పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో కొప్పడి సత్యనారాయణ, కొప్పాడి నాగబాబులను అరెస్టు చేశారు. . ఈ దాడిలో 180 ఎంఎల్ మద్యం సీసాలు 464, బీరు సీసాలు 108 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అవినాష్ తెలిపారు.

యువకుని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - రౌతులపూడి

ప్రమాదవశాత్తు ఏలేరు ఎడమ కాలువలో మంగళవారం గల్లంతయిన గుమ్మరేగుల గ్రామానికి చెందిన వెంటూరి జయాబాబు(29) మృతదేహం బుధవారం లభించింది. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని వన్నెపూడి జాతీయ రహదారిలోని డివైడర్‌లో మొక్కలకు నీళ్ల పోస్తున్న ట్యాంకర్‌ను చెన్నైకి వెళ్తున్న వ్యాన్ వేగంగా బుధవారం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ అమరాసన్‌కు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రత్తిపాడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో అతిని ఆరోగ్యం విషమించి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

విశాఖలో
సామర్లకోట యువకుని మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

విశాఖపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సామర్లకోట భాస్కర్ కాలనీకి చెందిన యువకుడు షేక్ కాజా మొహిద్దీన్ (24) దుర్మరణం చెందాడు. మృతిని కుటుంబీకులు అందించిన వివరాలు ప్రకారం.. విశాఖపట్నంలోని ఒక ప్రయివేటు సంస్థలో ఉద్యోగం చేస్తుండగా అతనిని చూసేందుకు సామర్లకోట నుంచి తల్లిదండ్రులు మంగళవారం విశాఖపట్నం వెళ్లారు. ఈ సందర్భంగా యువకుడు మొహిద్దీన్ తల్లిదండ్రులతో కలిసి విశాఖపట్నం బీచ్‌కి వెళ్తుండగా స్కూటీపై వెళుతున్న యువకుని కాన్వెంట్ సెంటర్లో లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంపై విశాఖపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీ కొట్టిన కారు: వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఆగివున్న లారీని కారు ఢీ కొట్టిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా సింహాచలం ఎస్ఆర్.పురం చెందిన గుంపిన కళ్యాణచక్రవర్తి, గుంపిన రవితేజ అనకాపల్లిలో స్నేహితుని నుంచి కారు తీసుకుని కాకినాడలో ఉన్న వేరే స్నేహితుడికి కారు అద్దెకి ఇవ్వడానికి వెళుతుండగా గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద అర్ధరాత్రి రెండు గంటల సమయంలో రోడ్డుపక్క మార్జిన్ దిగి మట్టిరోడ్లో పార్కింగ్ చేసిన లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న రవితేజ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అతని పక్కన కూర్చున కల్యాణ్‌చక్రవర్తి తలకు బలమైన గాయం అయింది. దీంతో అతనిని పిఠాపురం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయుడు రవీంద్ర ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బుధవారం మండలంలోని పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కాశి రవీంద్ర గ్రామస్తులను భాగస్వామ్యం చేసి ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ కోరుకొండ ధనలక్ష్మి, వైస్ ఛైర్మన్ పేరాబత్తుల భైరవమూర్తి, సిఆర్‌పి రేవు మానస, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

విశాఖపట్నం రఘు కళాశాలలో ఉపాధ్యాయురాలిపై విద్యార్థిని చెప్పుతో దాడి చేయడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ఎస్ఎస్ఎస్ పాఠశాల వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పైల రాణాప్రతాప్ మాట్లాడుతూ సమాజంలో నైతిక విలువలు నానాటికి తరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఆర్ఎఒ మునిస్వామి

సీచేమ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

మెట్టకూరులోని పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం సీచేమ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం అయింది. పుదుచ్చేరి క్రికెట్ అసోసియేషన్ సహకారంతో యానాం క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.రమేష్, సెక్రటరీ కె.సుబ్బారావు, జాయింట్ సెక్రెటరీలు చిట్టి, కె.ప్రసాద్, పి.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంటును ఆర్ఎఒ మునిస్వామి, సిఐ అడలరసన్, ఎస్ఐ పుణీత్‌రాజ్, నవోదయ ప్రిన్సిపల్ కీర్తి, మెట్టకూరు హైస్కూల్ హెచ్ఎం పి.రాజారామ్ మోహన్‌రావు పాల్గొని ప్రారంభించారు. మొత్తం 10 జట్ల మధ్య 30 ఓవర్ల మ్యాచ్‌ను లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. మే 15వ తేదీ వరకు లీగ్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఇటీలు పాలికి స్వామి, శేరు విష్ణు, చింతా వెంకన్న, జల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కామిశెట్టి సావిత్రికి నివాళి

ప్రజాశక్తి - యానాం

ఫ్రెంచ్ పాలన నుంచి యానాం విముక్తి కోసం పోరాడిన స్వాతంత్ర సమరయోధురాలు, మాజీ ఎంఎల్ఎ కామిశెట్టి సావిత్రి జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆమె విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి, సిఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజ్ తదితరులు పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సావిత్రి కుటుంబ సభ్యులు పైడికొండల రాజబాబు, చెక్కల అరుణ్‌కుమార్, శ్రీమంతుల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

రీజెన్సీ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - యానాం

10వ తరగతి పరీక్ష ఫలితాల్లో రీజెన్సీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. పరీక్షలకు 75 మంది హాజరుకాగా వీరిలో 46 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. 73 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు పాఠశాల హెచ్ఎం.టివిఎస్ఎస్‌వి.ప్రసాద్‌రావు తెలిపారు. కోడూరి నారాయణ మౌనికకు 589, పి.శ్రీరామ్ 588, సిహెచ్.నిశాంత్ శ్రీవర్ధన్ 584, ఎన్.తనుజా దేవి నాగమల్లిక 583, జి.మేఘన ప్రభమహేశ్వరి 581, ఎం.శశి పార్థు 580 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను రీజెన్సీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జివిఎన్.నాయుడు, రీజెన్సీ సెరామిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ సత్యాంతప్రసాద్, హెచ్ఎం ప్రసాదరావు అభినందించారు. అలాగే యానాం రీజియన్లో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 98 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారదా ప్రభుత్వ ఎయిడెడ్ హైస్కూల్లో 53 మంది పరీక్షకు హాజరుకాగా 49 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. రీజియన్ ప్రథమస్థానాన్ని తలాటం సహస్రా 594 మార్కులు, ఎస్‌జె.దుర్గాసాయిలక్ష్మి 590 మార్కులతో ద్వితీయస్థానాన్ని, కోడూరి నారాయణ మౌనిక 589 మార్కులతో తృతీయస్థానాన్ని సాధించారన్నారు.

ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పదో తరగతి పరీక్షల్లో మండలంలోని ఉత్తర కంచి ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు ఎం.సత్యశ్రీపద్మాదేవి 586 మార్కులు, ఎస్.కృష్ణకావేరి 583 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం అభినందించింది.

వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని తాటిపర్తి గ్రామంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల తీఉకోవాల్సిన జాగ్రత్తలపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు భాష, రజిమ్ బీమ్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరు వర్గాలతో శాంతి చర్చలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తనను గ్రామం నుంచి వెలివేశారంటూ మీడియా ముందుకు వచ్చిన వ్యక్తితోపాటు, స్థానిక పెద్దలతో అధికారులు శాంతి చర్చలు జరిపారు. బుధవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ పి.త్రినాధరావు, ఎస్ఐ పి.సత్యనారాయణ, ఎంపిడిఒ కె.సత్యనారాయణ, సిడిపిఒ మాధవి, ఆర్ఐ రామకృష్ణ, విఆర్ఓ వీరబాబు ఫిర్యాదుదారుకు, మాధవరాయునిపేట పెద్దలకు కౌన్సిలింగ్ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు టేకుముడి లక్ష్మణరావు, కట్ట త్రిమూర్తులు పాల్గొన్నారు.

మాధురి, శ్రీశారద విద్యా సంస్థల్లో ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - శంఖవరం



అభినందిస్తున్న శారద విద్యాలయం నిర్వాహకులు

మండలంలోని కత్తిపూడికి చెందిన మాధురి విద్యాలయం విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. తమ విద్యాలయం నుంచి 59 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా మొత్తం ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ ఛైర్మన్ కడారి తమ్మయ్యబాబు తెలిపారు. ఎం. గాయత్రిలక్ష్మీదేవి 583 మార్కులు, పివిఎం.వరలక్ష్మిదేవి 575, కెపిఎస్.అవినాష్ 572 మార్కులతో మొదటి మూడు స్థానాల్లో నిలవగా, 38 విద్యార్థులు 500 మార్కులు పైబడి సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. అలాగే అన్నవరం శ్రీశారద విద్యాలయం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని కరెస్పాండెంట్ కృష్ణవర్మ తెలిపారు. పరీక్షకు హాజరయిన వారిలో 80 శాతం విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించారని తెలిపారు. బి.అఖిల్‌సాయికమల్ 586 సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడని, కె.ప్రజ్ఞశ్రీ 583, జి.తేజస్వీ 581 మార్కులు సాధించినట్లు చెప్పారు.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్‌తోపాటు, ప్రిన్సిపల్ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

478 మంది విద్యార్థుల ఉత్తీర్ణత

ప్రజాశక్తి - రౌతులపూడి

10వ తరగతి పరీక్షలకు మండలం నుంచి 534 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 478 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని అని ఎంఇఒ గాడి కొండబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సెయింట్ థామస్ పాఠశాల విద్యార్థిని జి.అన్నపూర్ణాదేవి 569 మార్కులతో ప్రథమ స్థానం, రౌతులపూడి ఉన్నత పాఠశాల విద్యార్థి కర్రి యశ్వంత్ 567లతో ద్వితీయ, బలరామపురం పాఠశాల విద్యార్థిని గాది విజయలక్ష్మి 567 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. మండల ప్రథమ స్థానం సాధించిన అన్నపూర్ణ దేవిని సెయింట్ థామస్ పాఠశాల కరస్పాండెంట్ డి.దేవసుకుమార్ అభినందించారు.

మండలంలో 83.5 శాతం ప్రతిభ

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలో 83.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ జాన్ తెలిపారు. బుధవారం ఎంఇఒ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండలం నుంచి 586 మంది విద్యార్థులకు హాజరుకాగా 489 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. తణుకువాడ జడ్‌పి పాఠశాల విద్యార్థి వాసంశెట్టి చరణ్‌దీప్తి 585 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. స్థానిక జడ్‌పి పాఠశాలలో చదువుతున్న కవల పిల్లలు రేణుక, రేష్మ ఇద్దరూ 538 మార్కులు సాధించిడం విశేషమన్నారు. వినాయక, కోలంక వింగ్స్ పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. కుయ్యేరు జడ్‌పి పాఠశాలలో 99 శాతం, పల్లిపాలెం జడ్‌పి పాఠశాలలో 97 శాతం ఉత్తీర్ణత సాధించారని అన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎంపిడిఒ రాంబాబు, తహశీల్దార్ రాగూర్, హెచ్ఎం పంపన కృష్ణమూర్తి జనసేన నాయకులు అన్యం శ్రీరామచంద్రమూర్తి అభినందించారు.

విద్యా నికేతన్‌దే ప్రథమ స్థానం

ప్రజాశక్తి - గండేపల్లి

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ప్రయివేటు పాఠశాల నిలవగా తృతీయ స్థానంలో నాయకంపల్లి ప్రభుత్వ పాఠశాల నిలిచింది. జె.రాగంపేటకు చెందిన శ్రీసహస్ర విద్యాకేతన్ విద్యా సంస్థకు చెందిన బి.నవ్యశ్రీ హారిక 590, బి.అర్చన 575 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. నాయకంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.హాసిని 573 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచిందని ఎంఇఒ నాయక్ తెలిపారు. మండల వ్యాప్తంగా 522 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 444 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

మండలంలో 91 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలోని 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 91 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒలు కె. సత్యనారాయణ, సివివి.సత్యనారాయణ తెలిపారు. పదో తరగతి ఫలితాల నేపథ్యంలో వారు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 505 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగ 462 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మండలంలోని 6 ప్రయివేటు పాఠశాలల్లో 97 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

కరపలో 81 శాతం...

మండలంలో ప్రభుత్వం హైస్కూల్లో విద్యార్థులు 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. 9 జడ్‌పి హైస్కూల్స్‌లో 97 శాతం ఉత్తీర్ణతతో పెద్దాపురపాడు హైస్కూల్ ప్రథమ స్థానంలో నిలిచింది. 2వ స్థానంలో బిసి వెల్ఫేర్ హాస్టల్, 3వ స్థానంలో అరట్లకట్ట గ్రామం నిలిచిందని ఎంఇఒ బుల్లి కృష్ణవేణి తెలిపారు.

పిఠాపురంలో 75 శాతం...

మండలంలోని పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలు విద్యార్థులు 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒలు శ్యాంబాబు, నారాయణదాసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 1220 మంది పరీక్షకు హాజరవ్వగా 918 మంది ఉత్తీర్ణులు అయ్యారన్నారు. స్థానిక ఎస్‌బిఎంఆర్ ప్రభుత్వ బాలికొన్నత పాఠశాల విద్యార్థిని ఎం.శ్రీకీర్తన 587 మార్కులు, మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎన్.వెంకటవైశాలి 584, ఎస్‌బిఎంఆర్ ప్రభుత్వ బాలికొన్నత పాఠశాల విద్యార్థిని జి.మహాలక్ష్మి 583 సాధించి మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు.

గొల్లప్రోలు విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక జడ్‌పి బాలిక పాఠశాలకు చెందిన విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ప్రభంజనం సృష్టించారు. తోట పుష్పాంజలి 594 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆకేటీ కనకవల్లి 590 మార్కులు సాధించి మండల ద్వితీయ స్థానం జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ పాఠశాలలో 740 మంది పరీక్ష రాయగా 639 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని విద్యాశాఖ అధికారి నాయుడు వెంకటేశ్వరరావు తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ఎంపిడిఒ కర్రి స్వప్న, ఎంఇఒ-2 బి.శివప్రసాద్, హెచ్ఎం సిహెచ్.సూర్యప్రకాశ్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా సమతా కన్వీనర్ సిహెచ్‌యుఆర్.మంగతాయారు అభినందించారు.

10 ఫలితాల్లో 'శ్రీవిద్య' విజయకేతనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం



10వ తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక 'శ్రీవిద్య' విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ టివి.వేణి మాట్లాడుతూ శ్రీవిద్య సంస్థ నుంచి 58 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరు కాగా 55 మంది ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యారన్నారు. 8 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించారని తెలిపారు. మొదటి స్థానంలో వంకాయల హరిప్రియ 591, రెండవ స్థానంలో మాగాపు అర్జువల్లి 583, ఉప్పల రూపఅమృత 580 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్ టి.దమయంతి, హెచ్ఎం జి.శ్రీకాంత్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 214 మంది విద్యార్థులు హాజరు కాగా 198 మంది ఉత్తీర్ణులయ్యారని హెచ్ఎం ఎస్.లక్ష్మీతులసి తెలిపారు. తమ పాఠశాల నుంచి కోణాల పృథ్వీనాయుడు 577 మార్కులు, శిడగం బరతేంద్ర మహేష్ 570, గుండారపు రోహిత్ కుమార్ 570, మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎస్ఎంసి ఛైర్మన్ కె.సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం



చెక్కు అందిస్తున్న కూటమి నాయకులు

మండలంలోని రాయ భూపాలపట్నం జడ్‌పి హైస్కూల్లో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. బుధవారం పాఠశాలలో హెడ్మాస్టర్ మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఉత్తమ ఫలితాలు సాధించిన పుట్టా దీపిక (573), గంగా బత్తుల వీర వెంకట సత్యనారాయణ(547), భావిశెట్టి వీరబాబు(545) లకు గ్రామ కూటమి నాయకులు మన్యం ప్రసన్నకుమార్, కల్తూరి శ్రీను ల ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మన్యం చిన్న, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన కెజిబివి

ప్రజాశక్తి - కోటనందూరు

అల్లిపూడి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో 95.01 ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ జి.రాజేశ్వరి తెలిపారు. పరీక్షకు 39 మంది విద్యార్థినులు హజరు కాగా, 37 పాసయ్యారని అన్నారు. అన్నంరెడ్డి అలేఖ్య 573, పెదపాత్రుని లిఖిత 563, గొంప లలితాదేవి 558 మార్కులు సాధించి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని తెలిపారు. 500కు పైగా మార్కులు16 మంది విద్యార్థినులు సాధించారని తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థునులను జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో- ఆర్డినేటర్ వేణుగోపాలరావు, జిల్లా అధికారిణి జిసిడిఒ ఉమామహేశ్వరి, ఎంఇఒలు ఎవి.శ్రీనువాస్, ఎన్‌వి.రామశేఖర్ అభినందించారు.

ఇంటర్ విద్యార్థులను సత్కరించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెద్దాపురం



ఇంటర్ విద్యార్థినిని సత్కరిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

మండలంలోని చంద్రమాంపల్లి జడ్‌పి హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన బాలికలను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఘనంగా సత్కరించారు. బుధవారం పాఠశాలలో హెచ్ఎం శ్రీవల్లి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించిన పడాల వీరదుర్గలక్ష్మి, బర్రె మౌనిక, బీడీల రోషిలను సత్కరించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫిజిక్స్‌లో 60కి 60 మార్కులు సాధించిన పడాల వీరదుర్గాలక్ష్మికి, ఫిజిక్స్ అధ్యాపకులు తోట దుర్గాబాబు ఎంఎల్ఎ నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తిం వెంకట శ్రీనివాసరావు, రేలంగి బుజ్జి, మొయిళ్ళ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి



సిబ్బందితో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా రైతులకు సూచించారు. బుధవారం ఎండపల్లి, నాగులపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ధాన్యం కల్లాలను పరిశీలించి 22 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని రైతుల అంగీకారంతో కొనుగోలు చేస్తామని, 11 శాతం తేమకు క్వింటాకు ఒక కేజీ తరుగు ఇవ్వాల్సివుంటుందన్నారు. ఈ పర్యటనలో ఎఒ జోగిరాజు, ఎఇఒ నాగేంద్ర పాల్గొన్నారు.

సురేష్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - పిఠాపురం

మండలాల్లోని మల్లం గ్రామంలో విద్యుత్ షాక్ గురై మృతి చెందిన పల్లపు సురేష్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని మాజీ ఎంపి, నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వంగా గీత డిమాండ్ చేశారు. బుధవారం వైసిపి నాయకులతో కలిసి సురేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులోనే విద్యుత్ షాక్ గురై మరణించడం బాధాకరమన్నారు. కుల వివక్షత చూపడం, సాంఘిక బహిష్కరణలు చేయడం చాలా దారుణం అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు అవగాహన కల్పించడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రావుల మాధవరావు, గండేపల్లి బాబి, అడపా రఘు, కోప్పన శివనాధ్ పాల్గొన్నారు.

